ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 17 | సంచిక : 10 | జూన్ 2012



**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**చందా**

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

**రమణ భాస్కర**

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో....


జిన్నూరు ......... 16-10-2011

జిన్నూరు ......... 26-04-2012



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## విద్య

ఈ ప్రపంచంలో సక్రమంగా జీవించాలన్నా, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి రావాలన్నా, క్రమశిక్షణ నందించే 'విద్య' అవసరం. శాంతచిత్తం ప్రధానం. విద్య అంటే 'తెలియజేయునది' అని అర్థం. వాస్తవంగా తానెవరో? తన స్వరూపం ఏమిటో? తెలియజెప్పి, అంతరదృష్టిని కలిగించి, స్వరూప ఎరుకలోకి మేల్కొలిపేదే నిజమైన విద్య. అదే ఆధ్యాత్మికత. వాస్తవంగా తానెవరో? తెలియబడుటయే మోక్షము. దేహము పట్ల, లోకము పట్ల, ఆత్మబుద్ధి ఉన్నంతకాలం ఆత్మపట్ల ఆత్మబుద్ధి కలుగదు. ఆత్మకు, జీవుడికి స్వరూపంలో బేధం లేదు, వ్యవహారంలోనే బేధం ఉంది. వ్యవహార దృష్టిని అతిక్రమించి స్వరూప ఎరుకలోకి మేల్కొనే వరకు, జనన మరణ భ్రాంతి, అశాంతి, దుఃఖం, భయము, కోరిక నశించవు. స్వరూప మోక్ష స్థితికి అడ్డు వచ్చేది దేహాత్మబుద్ధే! మన స్వార్థమే! అట్టి దేహాత్మబుద్ధి త్యాగమే ఆత్మసాక్షాత్కారానికి మూలం. మనస్సు వ్యక్తిభావనద్వారా వేరుతనాన్ని కల్పిస్తే, గురువు దానిని పోగొట్టి హృదయంలోకి మేల్కొలుపుతారు. స్వరూప జ్ఞానాన్ని పొందాలనే బుద్ధి కేవలం సద్గురు దయవల్ల మాత్రమే కలుగుతుంది. మన అస్థిత్వానికి సంబంధించిన జ్ఞానాన్ని, అనగా పరమాత్మకు మనకు గల అభేదస్థితిని, జ్ఞానబోధ ద్వారా గురువు మనకు అందిస్తూ, జ్ఞాన ద్వారాన్ని తెరుస్తున్నారు. ఆత్మజ్ఞానాన్ని మనకు పంచుతున్న సద్గురువు శ్రీనాన్నగారికి మనము ఎంతో ఋణపడి ఉంటాం.

ఓం తత్ సత్.

**- చావలి సూర్యనారాయణమూర్తి, టీచర్, అమలాపురం**

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 16-10-2011, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ప్రకృతిగుణాలనుండి ప్రకృతివిషయాలనుండి, ప్రకృతిలక్షణాలనుండి బయటకు రావటం చాలా కష్టం అని ఆచార్యులవారు చెప్పారు. శరీరం ఉండగానే రాగద్వేషముల యొక్క వేగమును తట్టుకోవటానికి ఎవరు సమర్థులు అవుతున్నారో వారు ఆత్మజ్ఞాన సముపార్జనకి యోగ్యత సంపాదిస్తారు. దీనికి పునాది ఏమిటంటే సదాచారం. మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే తెలివితేటల కంటె క్రమశిక్షణ చాలా ముఖ్యం. క్రమశిక్షణ లేకపోతే మనకి ఇంద్రియాలు స్వాధీనంలోనికి రావు, మనస్సు స్వాధీనంలోనికి రాదు, మనకు సదాచారం ఉండదు. మనదైనందినజీవితంలో క్రమశిక్షణ చాలా ముఖ్యం.

పూర్వంకంటె ఇప్పుడు తెలివితేటలు పెరిగాయి అని చాలామంది అంటారు. తెలివితేటలు పెరిగేకొలదీ తప్పులు ఎక్కువ చేస్తున్నారు. తెలివితేటలు తక్కువ ఉన్నప్పడే వాళ్ళు సదాచారంగా ఉన్నారు, క్రమశిక్షణగా ఉన్నారు. పూర్వం పద్ధతులకి ఒక క్రమశిక్షణ ఉండేది, లిమిట్ ఉండేది. తెలివితేటలు పెరిగేకొలదీ, సైన్సు, టెక్నాలజీ పెరిగేకొలదీ క్రమశిక్షణ తగ్గిపోయింది. మన తెలివితేటలు ఆత్మజ్ఞానసముపార్జనకి ఉపయోగపడాలి. మనకి తెలివితేటలు ఉన్నాయి. వాటిని మనం సద్వినియోగం చేసుకుంటున్నామా? దుర్వినియోగం చేసుకుంటున్నామా? తెలివితేటల్ని మనం దుర్వినియోగం చేసుకుంటున్నాము. మన తెలివితేటల్ని మనం సద్వినియోగం చేసుకోవాలి. అలవాటు చేసుకోవటం తేలిక. అలవాటులోంచి బయటకు రావటం కష్టం. అలవాటు ఏదో జన్మలో మనం నేర్చుకుంటే వచ్చింది. ఇప్పడు నువ్వు ప్రయత్నంచేసి పోగొట్టుకుంటే ఆ అలవాటు పోతుంది. అలవాట్లువేరు, నువ్వువేరు. సుబ్బమ్మకి అలవాట్లు ఉన్నాయి. కాని అలవాట్లు సుబ్బమ్మకాదు. అలవాటు వేరు, మనం వేరు అనే విభజన చేసుకోవటం మానేసాము. నువ్వే అలవాటు అనుకొంటే నీకు ఆ అలవాటు ఎలా పోతుంది. మీరు విడదీసుకోలేకపోతున్నారు. వూరికే జపం చేస్తే, ధ్యానం చేస్తే ఆ అలవాటుపోదు, సజ్జక్టును పరిశీలన చేసుకోవాలి. మీకు ఏ మార్గం అయితే ఇష్టమో ఆ మార్గం కర్మమార్గమో, భక్తిమార్గమో ఏ మార్గంలో ప్రయాణం చేసినా మీరు ఆత్మజ్ఞానం పొందాలి.

మీరు పవిత్రతకోసం, ఏకాగ్రతకోసం జపంచేసుకోండి, ధ్యానంచేసుకోండి కానీ మీరు ఆత్మానుభవం పొందేవరకూ లోకం మిమ్మల్ని విడిచిపెట్టదు. మీకు ఉన్న డబ్బువల్లకాని,

సంతానంవల్లకాని, మీకు ఉన్న అధికారంవల్లకాని దేనివల్ల మిమ్మల్ని లోకం విడిచిపెట్టదు. స్వరూపజ్ఞానం కలిగాక అప్పుడు లోకం వాళ్ళకి బ్రహ్మముగా కనిపిస్తుంది. స్వరూపజ్ఞానం కలగనప్పుడు ఈలోకం, పుట్టుకలు, చావులు, మంచిగుణాలు, చెడ్డగుణాలు ఇవి అన్నీ నిజం కింద అనిపిస్తాయి. మిమ్మల్ని ఎవరైనా స్తోత్రం చేస్తే సంతోషం వస్తుంది. విమర్శిస్తే మీకు దు:ఖం వస్తుంది. ఎందుచేతనంటే ఆరెండూ కూడా మీరు నిజం అనుకుంటున్నారు. ఈద్వంద్వాలన్నీ అజ్ఞానికి ఎంత సత్యంగా కనిపిస్తాయో జ్ఞానికి అంత అసత్యముగా కనిపిస్తుంది. అందుచేత జ్ఞానికి ఎక్కడా చలనం ఉండదు. మీకు లోకము బ్రహ్మముగా కాకుండా లోకంలోకంగా కనిపిస్తున్నంతకాలం నువ్వు కోటిజన్మలు ఎత్తినా ప్రపంచం నిన్ను విడిచిపెట్టదు, లోకం నిన్ను పీడించి వదిలిపెడుతుంది. దీనినుంచి నువ్వు తప్పకోవటానికి ఎటువంటి చిట్కాలు లేవు. ఒక్కచైతన్యం తప్పించి మిగతావన్నీ కల్పితాలే. నీకు వచ్చే లాభంకాని, నష్టంకాని నీకు ఏది వచ్చినా అది మనస్సు యొక్క కల్పితమే. మనదేహానికి, మనస్సుకు, ఇంద్రియాలకు, ఈ చావు పుట్టుకలకు, బంధుత్వాలకు, స్నేహాలకు, విరోధాలకు నీలోపల ఉన్న సద్వస్తువుకు ఏమీ సంబంధం లేదు.

మనం కాలక్షేపంకోసం అస్తమానూ లోకం గొడవలు చెప్పకుంటాము, లేకపోతే దేహంగొడవ చెప్పకుంటాము పండితులకి ఎక్కువ శాస్త్రం గొడవ ఉంటుంది. అస్తమానూ ఈ గ్రంథంలో ఇలా చెప్పాడు, ఆగ్రంథంలో అలా చెప్పాడు అంటారు. వాళ్ళకి అదొక వ్యసనం. లోకవ్యసనం ఉన్న వాళ్ళకి చైతన్యం గురించి, భగవంతుడి గురించి చెబితే వాళ్ళకి ఇష్టం ఉండదు, వాళ్ళకి 24గంటలూ లోకం గురించి చెప్పాలి. మీకు ఏవాసన ఉందో ఆవాసన ఉన్న వాళ్ళు మీఇంటికి వస్తే మీరు ఇంకా ఇష్టంగా ఉంటారు. మనకి ఒక దేహం ఉంది. దానికి స్నానం చేయించాలి, బట్టలు చుట్టబెట్టాలి. ఆదేహానికి అన్నం పెట్టాలి. దేహానికి చేయవలసినది మినిమమ్ చేయాలి. అస్తమానూ దేహం ధ్యాసలో ఉండకూడదు. మీ పూర్వజన్మ ప్రారబ్దాన్నిబట్టి ఆ ఇంటిలోనికి వచ్చారు. మీ ఇంట్లో వారు వారి ప్రారబ్దాన్ని బట్టి అక్కడకు వచ్చారు. పరమేశ్వరుడు ఈపని మనకి అప్పగించాడు అని ఆపనిని పరమేశ్వరుడు ప్రీత్యర్థంగా చేస్తే మనకి దేహవాసన తగ్గుతుంది. ఈశ్వరానుగ్రహం సంపాదించటానికి, ఈశ్వరుడి దయ సంపాదించటానికి ఈపని చేస్తున్నాము అనే భావన మనలో ఎంతమందికి ఉంది. మీరు పని గౌరవంకోసం చేస్తారు. పేరు వస్తుంది అంటే ఆపని చేస్తారు. ఇలా పని చేయుటం వలన మీకు జ్ఞానంరాదు, మీకు రజోగుణం పెరుగుతుంది. మీరు చేత్తోటి ఒక మంచిపని చేసినా, నోటితోటి ఒక మంచి మాట మాట్లాడినా, మీకు మనస్సులోకి మంచి

ఆలోచన వచ్చినా ఇవన్నీ కూడా ఈశ్వరానుగ్రహం సంపాదించటానికి అనుకూలంగా ఉండాలి.

మీకు భగవంతుడు ఎప్పుడు లభ్యమవుతాడు అంటే కాముకుడికి కామిని మీద ఎంత ఇష్టం ఉంటుందో , లోభికి ధనం మీద ఎంత ఇష్టం ఉంటుందో నీకు పరమేశ్వరుడు మీద అంతప్రీతి ఉంటే నీకు జ్ఞానం వస్తుంది అని రామకృష్ణపరమహంసగారు చెప్పారు. ఆప్రీతి లోపలినుంచి రావాలి కాని పైనుంచి పోసేది కాదు. జ్ఞానం కూడా లోపలి నుంచి ఊరాలి కాని పైనుంచి పోసేది కాదు. మనకి దేహబుద్ధి ఉంది కాబట్టి భగవంతుడికోసం బయట తిరుగుతున్నాము. నీ అంత:కరణం పవిత్రం అయినప్పుడు, నీ సహస్రారం శుద్ధి అయినప్పుడు పరమేశ్వరుడు నీహృదయంలో స్వరూపంగా వ్యక్తమవుతాడు. మీరు ఇంట్లోవాళ్ళకి సేవచేసినా, బయటవాళ్ళకు సేవచేసినా నిర్మలంగా చేయండి, ప్రీతిగా చెయ్యండి, పని పనికోసమే చెయ్యండి. మీరు పని పనికోసమే చేస్తే ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. గురువు ఎట్లా లభిస్తాడు అని ఒకరు రమణమహర్షిగారిని అడుగుతారు. నీకు భగవంతుడి పట్ల సజీవమైన విశ్వాసం ఉండాలి. నువ్వు సత్కర్మ నిరహంకారంగా, నిరాడంబరంగా చేస్తూ ఉంటే సర్వాంతర్యామి అయిన భగవంతుడే భక్తుని పరిపక్వతను బట్టి గురురూపంలో వచ్చి నీకు దర్శనమిస్తాడు. బయట గురువు బోధిస్తాడు. లోపల గురువు నిన్ను అనుగ్రహిస్తాడు. లోపలి గురువు బయిట గురువు వేరుకాదు ఉన్నది ఒక్కడే గురువు చేసేపని ఏమిటి అంటే ఆయన నిన్ను విమర్శించకుండా సాఫ్ట్‌గా నీదోషాలను తెలియపరుస్తాడు. ఎక్కడ నీకు మైనస్ పోయింట్స్ ఉన్నాయి, నీకు ఏ బలహీనత ఉంది అని స్కానింగ్ తీసినట్టు అన్నీ జాగ్రత్తగా తీసి ఒక్కో బలహీనతలోంచి నిన్ను విడుదలచేసి గురువు ఏ స్థాయిలో ఉన్నాడో ఆస్థాయి పొందేవరకూ నిన్ను విడిచిపెట్టడు. అదే పులినోట్లో పడ్డ మాంసపు ముక్క పులి నోట్లో పడ్డ మాంసపు ముక్కని మనం బయటకు తీయలేము. అలాగే ఒకసారి గురువు యొక్క అనుగ్రహంలో పడితే మళ్ళీ నువ్వు అందులోనుండి బయటకు రాలేవు. నీకోసమే ఆయన శరీరం ధరించి నువ్వు ఏ బలహీనతల్లో ఉన్నావో చూచి ఆ బలహీనతలనుండి నిన్ను విడిపించి ఆయన స్వరూపం ఇచ్చే వరకూ నిన్ను విడిచిపెట్టడు. వాడు గురువు.

ఇతరుల లోపాలు వెదికేవాళ్ళకి వాళ్ళలోపాలని తెలుసుకునే టైము ఉండదు. ఈలోపు వాడి శరీరానికి చావు వచ్చేస్తుంది అన్నాడు వేమన. అందుచేత నువ్వు ఇతరుల లోపాలు చూడకుండా, ఏకాంతంగా ఉండి నీలోపాలు ఏమిటో నువ్వు తెలుసుకుని అందులో నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి నీలోపాలు నువ్వు తెలుసుకోవటానికి ఎంతో కొంత

ఏకాంతవాసం అవసరం. మనకి గురువుకి తేడా ఏమిటి అంటే, మనకి లోపల ఉన్న వాసన తలంపు రూపంలోకి వచ్చేవరకూ మనకు తెలియదు కాని మన హృదయంలో ఉన్న వాసన గురువుకి తెలుస్తుంది. గురువు చేసే పని ఏమిటి అంటే మనలో ఉన్న వాసనను తలంపు రూపంలోకి రానిచ్చి అప్పుడు బయటికి లాగి తగలబెడతాడు. మనకి ఏది మంచిదో మనకంటె గురువుకి బాగా తెలుసు. మీరు తొందరపడకండి, ఆవేశపడకండి, ఉద్రేకపడకండి ఈశ్వరుడు మీకు ఏది అవసరం అనుకుంటాడో అంతవరకే మీకు కేటాయిస్తాడు. అంతకు మించి నువ్వు అడిగినా ఇవ్వడు అన్నాడు ఏసు. మీకు దేశం అంతాకావాలి. మీకు ఏది అవసరమో మీకంటే భగవంతుడికే బాగా తెలుసు కాబట్టి మీరు ప్రతీది అడిగేసి నోరు పాడుచేసుకోకండి. నీ యోగ్యతకి మించి, అర్హతకి మించి నీకు కేటాయిస్తే నువ్వు పాడైపోతావని ఈశ్వరుడికి తెలుసు. నీ ఆశని బట్టి నీకు కేటాయించడు నీ అవసరాన్ని బట్టి నీకు కేటాయిస్తాడు వాడు ఈశ్వరుడు.

మీకు అస్తమానూ లోకం జ్ఞాపకం వస్తోంది అనుకోండి, మీకు లోకం మీద మమకారం ఉందని అర్థం. లోకం నీకు అణిగిపోవాలంటే లోకం నీకు కనిపించకుండా పోవాలి అంటే నువ్వు ద్వంద్వాల లోంచి బయటకు రావాలి, అద్వైతానుభవం పొందాలి. ఈ శరీరం చనిపోయింది అనుకోండి, శరీరం పీడ వదిలిపోయినా లోకం విడిచిపెట్టదు. మళ్లీ ఇంకో శరీరం వచ్చినప్పుడు లోకం పట్టుకుంటుంది. నువ్వు బ్రహ్మజ్ఞానం పొందేవరకూ లోకం అణగదు, లోకం నిన్ను విడిచిపెట్టదు. దీనికి ఒక కథ చెబుతారు. గోదావరి నదికి వరద వచ్చినప్పుడు ఒక ఎలుగుబంటు కొట్టుకు వెళుతూ ఉంటే అది టేకుదుంగేమో ఒడ్డుకి తెచ్చుకుని అమ్ముకుందామని ఈతగాడు దానిని పట్టుకున్నాడు. అది టేకు కాదు ఎలుగుబంటి. అది వీడిని పట్టుకుంది. గట్టుమీద ఉన్నవాళ్ళు అన్నారు. ఆ టేకుతో పాటు నువ్వు కూడా కొట్టుకుపోతున్నావు, దానిని వదిలేసి ఒడ్డుకు వచ్చేయి అన్నారు. నేను దానిని వదిలేశాను, కానీ అది నన్ను వదలకుండా లాక్కువెళ్ళిపోతోంది అన్నాడు. అలాగే ఒకవేళ మనం లోకాన్ని వదిలించుకోవలన్నా లోకం మనల్ని వదిలిపెట్టదు. నువ్వు అదృష్టం వచ్చినప్పడు ఒకరకం గాని, దురదృష్టం వచ్చినప్పడు ఒక రకంగాని ఉంటున్నావు అనుకో, ఆ జన్మలోనేకాదు, కోటిజన్మలు ఎత్తినా లోకము నిన్ను విడిచిపెట్టదు. మీకు అస్తమానూ దేహం జ్ఞాపకం వస్తోంది అనుకోండి, మీకు దేహం మీద మమకారం ఉందని అర్థం. ఆ దేహం మీద ఉన్న మమకారం తగ్గించడానికి గురువు అంతరంగంగా ఉండి ప్రయత్నం చేస్తాడు. ఒకవేళ మీరు గురువుని విడిచి పెట్టేసినా గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు. మిమ్మల్ని తరింపచేసే వరకూ వదలడు

వాడు గురువు. దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన ఈ మూడు వాసనలు లేకపోతే నీ మనస్సు బాహ్యముఖానికి వెళ్ళమన్నా వెళ్ళదు. మన మనస్సుని ఎటువంటి పరిస్థితులలోను కంగారు పెట్టుకోకూడదు. మన మనస్సుని మనం కంగారుపెట్టుకున్నాము అనుకోండి మళ్ళీ మన మనస్సుని మనమే వెనక్కి లాక్కోవాలి. ఎవరో వచ్చి సహాయం చేస్తారని మీరు కనిపెట్టుకుని ఉండకండి. తల్లితండ్రులకు పది ఎకరాలు పొలంఉంటే మీకు రెండు ఎకరాలు రాసి యిస్తారు కాని వాళ్ళు మీకు మోక్షం ఇవ్వటానికి పనికిరారు. మీకు రోగం వస్తే డాక్టరు దగ్గరకి వెడితే రోగం లోంచి విడిపించవచ్చు కానీ అజ్ఞానం లోంచి విడిపించడానికి ఈశ్వరుడు తప్పించి, గురువు తప్పించి ఇంకో మనిషికి సాధ్యంకాదు.

భగవాన్ చివరి రోజులలో ఒక భక్తుడు ఏమన్నాడు అంటే మీ శరీరం శిథిలమయిపోయింది ఇంక ఎంతోకాలం ఉండదు, ఇంక మమ్మల్ని అనుగ్రహించేవాళ్ళు ఎవరు ఉంటారు, మా పట్ల దయ చూపించే వాళ్ళు ఎవరు ఉంటారు అని అడిగితే భగవాన్ ఏమన్నారంటే ఇప్పుడు మిమ్మల్ని అనుగ్రహించేది, మీ పట్ల ప్రేమ చూపించేది ఈ దేహమా? దేహము, మనస్సు, ఇంద్రియాలు, బుద్ధి అన్నీ జడమే. ఈ జడవస్తువులా మిమ్మల్ని అనుగ్రహించేవి. మిమ్మల్ని శరీరం అనుగ్రహించటం లేదు. మిమ్మల్ని ఏదయితే అనుగ్రహిస్తుందో దానికి చావులేదు. శరీరం చనిపోయిన తరువాత కూడా గురువుతోటి అనుబంధం తెగదు. గురువు అంటే ఆత్మ. ఆయన స్వరూపం నువ్వు పొందేవరకూ నువ్వు ఏజన్మలో ఉన్నా నిన్ను వెంటాడుతూ ఉంటాడు. గురువు యొక్క దయ, గురువు యొక్క అనుగ్రహం నిన్ను అజ్ఞానం లోంచి మేల్కొలుపుతుంది. గురువు యొక్క అనుగ్రహం అంత బలీయమైనది. నీకు స్వరూపజ్ఞానం కలిగిన తరువాత గురువు వేరు, నేను వేరు అనే భావన పోతుంది.

కొంతమంది భగవంతుడిని ఏవో కోరికలు కోరుకుంటూ ఉంటారు. భగవాన్ ఏమన్నారంటే కోరికలు కోరుకోకూడదు అని కాదు. నీ భక్తి నిజమైతే, నీ భక్తి కనుక పరిపక్వమయితే ఒక్క ఆత్మజ్ఞానం తప్పించి నువ్వు ఏదీ కోరుకోవు. ఎందుచేతనంటే ఆత్మజ్ఞానం తప్పించి ఏది కోరుకున్నా కాలప్రవాహంలో కొట్టుకుపోతుంది. మీకు అదృష్టం వచ్చిందనుకోండి అదీ పోతుంది, దురదృష్టం వచ్చింది అనుకోండి అదీ పోతుంది. లోకంలో ఏదో ఒకటి జరుగుతూ ఉంటుంది. అందులో ఒక సంఘటన కూడా నిజం కాదు అని మనం నోటితో చెప్పకుంటున్నాము. అది నీకు అనుభవంలోనికి రావాలి. అప్పడు నీకు దుఃఖం ఏముంది. నీకు ఏనుగుమీద కూర్చున్నట్టు ఉంటుంది అప్పడు మీరు లోకంమీద ఆధారపడనక్కరలేదు. మీరే లోకానికి శాంతిని ఇవ్వవచ్చు, జ్ఞానం ఇవ్వవచ్చు. అంటే మీకు

ఏదయినా మంచి సంఘటన జరుగుతున్నప్పటికీ, చెడ్డ సంఘటన జరుగుతున్నప్పటికీ ఇవి నూటికి నూరుపాళ్ళు అసత్యము అనేటటువంటి విషయం మీకు అనుభవం లోకి వస్తే దుఃఖస్పర్శకూడా మీకు ఉండదు. మిమ్మల్ని అక్కడకి తీసుకువెళ్ళటమే ఈ మీటింగుల యొక్క లక్ష్యం. అయితే అవన్నీ మీకు నిజంకింద కనిపిస్తున్నాయి అనుకోండి ఇంక మీకు దుఃఖం ఆగదు. మీరు దుఃఖాన్ని ఎన్ని రోజులు కంట్రోలు చేసుకుంటారు. మన హృదయంలో ఉన్న వస్తువు ఉన్నది ఉన్నట్టుగా మీకు వ్యక్తం కావాలి అప్పుడు మీకు దుఃఖస్పర్శ ఉండదు. అప్పడు అంతా శాంతే, అంతా ఆనందమే, అది అన్‌బ్రోకెన్‌గా ఉంటుంది, దానికి ముగింపు లేదు.

గురువులేకుండా జ్ఞానం రావచ్చా అని అడిగితే, గురువు లేకుండా డైరెక్టుగా ఈశ్వరానుగ్రహం వలన జ్ఞానం పొందినవాళ్ళు, చాలా కొద్దిమంది మాత్రమే ఉంటారు. జనరల్‌గా జ్ఞానం పొందటానికి గురువు అవసరమే. ఒక వ్యక్తి గురువుగా ఉండటానికి సమర్థుడు అవునో, కాదో ఎలా తెలుస్తుంది నాకు అని ఒకరు అడిగారు. ఆ మనిషి గురువు అవునోకాదో నీకు ఎలా తెలుస్తుంది అంటే నువ్వు ఎంత అడవి గొడవల మధ్యలో ఉన్న ఆయన సన్నిధిలో నీ ప్రయత్నం లేకుండా శాంతిని, సుఖాన్ని పొందుతూ ఉంటావు. ఆయన దగ్గరనుంచి వచ్చే శాంతితరంగాలు ద్వారా, కాంతితరంగాలు ద్వారా, శక్తితరంగాలు ద్వారా ఎంతోకొంత నీకు ఆవ్యక్తిపట్ల గౌరవం ఏర్పడుతుంది. గౌరవం ఏర్పడటమే కాదు, ఆయన సమక్షంలో మనకి స్వరూపజ్ఞానం సంపాదించాలనే బుద్ధి కలుగుతుంది. వివేకానందుడు రెండుమూడుసార్లు అమెరికా వెళ్ళాడు. ఒకసారి రాక్‌ఫెరల్డ్ వివేకానందుడిని చూడడానికి వచ్చాడు. ఒక గంట కూర్చున్నాడు, తరువాత స్వామీజీకి ఇండియా ఉత్తరం వ్రాశాడు. నేను సంపాదించిన డబ్బుతో ఈ మధ్య కాలంలో ప్రజలకు చాలా ఉపకారాలు చేశాను అని వ్రాశాడు. అప్పుడు స్వామీజీ ఏమని వ్రాశాడంటే నువ్వు వచ్చినన్ను చూడక ముందు ఈ ప్రజలకు సహకరించాలనే బుద్ధి అసలు నీకు లేదు. నన్ను చూడకముందు ఒక్క మంచిపనికూడా నువ్వు చెయ్యలేదు. నువ్వు వచ్చి నన్ను చూశాక ప్రజలకి సహకరించాలనే బుద్ధి నీకు కలిగింది. అప్పుడు ఈ మంచిపనులన్నీ చేశావు. ఈ మంచిపనులన్నీ చేయటానికి కారణం నువ్వుకాదు, నేనే కారణం అని వ్రాశాడు. డబ్బునీదే కాని మంచిపనులు చేయాలనే బుద్ధిని నీకు ప్రసాదించినవాడిని నేనే అన్నాడు స్వామీజీ.

నేను అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ గీతలో చెప్పాడు. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నప్పుడు నా హృదయంలో కూడా ఉన్నాడు కదా, ఉంటే నాకు ఎందుకు అనుభవంలోనికి రావటంలేదు అని ఒకరు భగవాన్‌ని అడిగారు.

భగవాన్ ఏమని చెప్పారంటే నీ అలవాట్ల యొక్క వేగంలోంచి, రాగద్వేషాలయొక్క వేగంలోంచి, కామక్రోధాలయొక్క వేగంలోంచి నువ్వు శరీరం ఉండగానే బయటకురా. అప్పుడు హృదయంలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడు నీకు అనుభవంలోనికి వస్తాడు. అప్పుడు ఇతరుల మాటలమీద నువ్వు ఆధారపడి ఉండనక్కరలేదు. మనల్ని పాడుచేసేది రజోగుణం. రజోగుణం పెరిగే మాటలుకాని, రజోగుణం పెరిగేపనులుకాని, రజోగుణం పెరిగే ఆలోచనలు కాని మనం రానివ్వకుండా చూచుకోవాలి. ఒకమాట నువ్వు మాట్లాడితే ఆమాట నీ రజోగుణం పెంచుతుంది అనుకో ఆమాట మాట్లాడటం మానేయి. చనిపోవటం పుట్టటం, పుట్టటం చనిపోవటం ఇదొక అడవి. ఈ అడవిలో నుండి మనిషి బయటికి రాలేడు. ఆ అడవిలోనుండి మనిషిని ఎవడైతే బయటికి తీసుకురాగలడో వాడే గురువు.

అశాంతి ఎక్కడ లేదో, దుఃఖము ఎక్కడ లేదో, భయము ఎక్కడలేదో అక్కడకి మిమ్మల్ని తీసుకుపోవటమే ఈ మీటింగుల యొక్క ప్రయోజనం. మనకి లేనిది ఉన్నట్టు కనిపిస్తోంది అనుకో ఉన్నది ఉన్నట్టు కనబడదు. మనం ఉన్నది ఉన్నట్టుగా చూడగలిగితే లేనిది లేనట్టుగా అర్ధమవుతుంది. ఉన్నది ఉన్నట్టుగా మీకు అనుభవంలోకి వస్తే మీకు అశాంతిలేదు, దుఃఖములేదు, పునర్జన్మలేదు. మీరు శాంతిని బజారులో కొనుక్కోలేరు కదా. మీకు ఒక చిన్నకారు కొనిచ్చినవాడు గొప్పవాడా? మీకు శాంతినిచ్చేవాడు గొప్పవాడా? అంటే మీకు శాంతిని ప్రసాదించేవాడే గొప్పవాడు. శరీరం ఉండగానే అజ్ఞానం యొక్క వేగం తగ్గిపోవాలి. ఉన్నవస్తువు ఉన్నట్టుగా మనికి వ్యక్తం కావాలి. ఈ ప్రవచనాలయొక్క సారాంశం అది. అంతేకాని దీనివల్ల మరొక ప్రయోజనం ఏమీలేదు. మీరు కోటిరూపాయలు పెట్టి శాంతిని కొనుక్కోగలరా? ఒక్క గురువు మాత్రమే శాంతిదాత, కాంతిదాత.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 26-04-2012, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈరోజు శంకరజయంతి. శ్రీరామనవమి, కృష్ణాష్టమి ఎటువంటివో శంకరజయంతి కూడా అలాగ పర్వదినం. కొంతమందికి శంకరుడే గురువు, శంకరుడే ఆచార్యుడు, శంకరుడే దైవం. శివుడే శంకరుడిగా వచ్చాడు, పరమేశ్వరుడే గురురూపం ధరించాడు అని చెపుతారు. రాముడిలాగ, కృష్ణుడిలాగ ఇక్కడ రాక్షససంహారం లేదు, ఇక్కడ బోధించటం ఒక్కటే కార్యక్రమం. పూర్వపుగ్రంధాలను పరిశీలించటం, వాటికి భాష్యాలు రాయటం, వాటిని అర్థమయ్యేలాగ ఇతరులకు చెప్పటం, ఇలా దేశం అంతా తిరిగాడు. ఆచార్యుడు అంటే మన

ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, ఆచరించి, దానిని ఇతరులకు అర్థమయ్యేలాగ బోధించేవాడిని ఆచార్యుడు అంటారు. ఆచార్యులవారు కాలడీలో జన్మించారు. ఆచార్యులవారి తల్లిపేరు ఆర్యాంబ, తండ్రిపేరు శివగురువు. ఆచార్యులవారు కారణజన్ముడు. శంకరుడి గురువు గోవిందభగవత్పాదుడు.

మీరు శరీరంతో తాదాత్మ్యం పొందుతున్నారు కాని మీరు శరీరరహితులే. మీరు శరీరరహితులు అని నోటితో చెప్పటంకాదు, అది మీకు అనుభవంలోకి వచ్చేవరకు మీరు శరీరాలను మొయ్యవలసిందే. శరీరరాహిత్యమే నీ నిజస్వరూపం. ఈ నడుస్తున్న శవాల హృదయంలో అంతర్యామిగా ఉన్నవాడు ఎవడు? మీ ఇంద్రియాలకు, మనస్సుకు, బుద్ధికి ఆధారంగా ఉండి వీటిని ఆడించేవాడు ఎవడు? వాడే ఈశ్వరుడు. ఆయన శరీరరహితుడు. మీరు కూడా అదే, కాని అది మీకు తెలియటం లేదు. బాహ్యంగా మీకు ఉన్న అధికారం వలన గాని, ధనంవలనగాని, పాండిత్యంవలనగాని, మీ సంతానం వలన గాని అది మీకు తెలియదు. నేను అక్కడ గుడి కట్టించాను, ఇక్కడ రోడ్డు వేయించాను అంటే మీరు మంచి పనులు చేస్తే చెయ్యండి, వాటివలన మీకు పుణ్యం వస్తుంది, మీకు మంచి జన్మలు వస్తాయి, అది కర్మసిద్ధాంతం. మంచిపనులు చేస్తే పుణ్యం వస్తుంది, అనుభవిస్తే అది పోతుంది, కాలప్రవాహంలో అన్నీ కొట్టుకొనిపోతాయి. చావులు, పుట్టుకలు, కష్టాలు, సుఖాలు ఇవన్నీ అబద్ధం, మరి ఎవరు నిజం? నీలో అంతర్యామిగా ఉండి నిన్ను ఎవడైతే నడిపిస్తున్నాడో, నీ కళ్ళకు చూసేశక్తిని, నీ బుద్ధికి ఆలోచించేశక్తిని ఎవడైతే ఇస్తున్నాడో వాడు మాత్రమే నిజం. వాడు నీ లోపలే ఉన్నాడు కాని వాడు ఎవడో మీకు తెలియటంలేదు. మరి ఆయన ఎలా తెలియబడతాడు? నీ మనస్సు, బుద్ధి, ఇంద్రియాలు ఏ హృదయంలోనికి వెళ్ళి అణిగిపోతున్నాయో, ఇవన్నీ ఎక్కడికి వెళ్ళి విశ్రాంతి పొందుతున్నాయో అక్కడే భగవంతుడు నీకు తెలియబడతాడు. వాడే ఆత్మ, వాడే చైతన్యం. చైతన్యం నీ హృదయంలో ఉంది, అది అంతటా వ్యాపించి ఉంది. దానికి కాలంతోటి, శరీరంతోటి, దేశంతోటి ఏమీ సంబంధం లేదు, దానికి బయట గొడవలు ఏమీ అక్కరలేదు. అది ఉండటం వలననే అది తెలియబడుతూ ఉంటుంది. దాని గురించి జీవితం పొడుగునా బోధించిన వాడు శంకరాచార్యులు, ఆయన ప్రథమ ఆచార్యుడు, ది గ్రేట్ ఆచార్య. ఒకే వ్యక్తిలో జ్ఞానం ఉంది, భక్తి ఉంది, యోగం ఉంది, ఆయనకు యోగిక్ పవర్స్ ఉన్నాయి. విద్యార్థి దశలో ఆచార్యులవారు కొంతకాలం భిక్ష చేసుకొన్నారు. భిక్షకు వెళితే అందరూ రకరకాల మాటలు అంటారు కదా. ఆ మాటలు పడినప్పుడు మనం ఎలా ఉంటున్నామో అది ఒక శిక్షణ. ఆచార్యులవారు భిక్షకు ఒకరింటికి

వెళ్ళారు. వారు చాలా బీదవారు. ఏ రోజు కష్టపడితే ఆ రోజు పొట్టవెళుతుంది కాని వెనకాల ఏమీ ఆస్థులు లేవు. ఈ పిల్లవాడు చాలా ముచ్చటగా ఉన్నాడు, వీడికి ఏదో ఒకటి పెట్టాలని ఆ ఇల్లాలికి అనిపించి ఇల్లంతా తిరుగుతోంది. అలా ఇల్లంతా తిరిగి చివరకు ఒక ఉసిరి కాయ తెచ్చి ఆచార్యులవారి గిన్నెలో వేసింది. ఆచార్యులవారు ఇదంతా చూసి వారికి ఏదైనా ఇవ్వమని లక్ష్మీదేవిని ప్రార్థించాడు. వారు పూర్వజన్మలలో ఎవరికీ ఏమీ పెట్టినవారుకాదు వారి ఎక్కౌంటులో ఏమీలేదు, అందుచేత ఈ అమ్మగారికి ఇవ్వటానికి ఏమీ అవకాశంలేదు అని లక్ష్మీదేవి చెప్పింది. పూర్వం గొడవవద్దు, ఇప్పడు నాకు ఈ ఉసిరికాయ ఇచ్చింది కదా, ఇది నిజమే కదా, అందుచేత వారిని అనుగ్రహించమని అడిగితే అప్పడు లక్ష్మీదేవి బంగారపు ఉసిరికాయలు కురిపించింది. సర్వసాధారణంగా సంపద మూడుతరాలు, నాలుగుతరాలు కంటే ఎక్కువ నిలబడదు. సంపాదించేటప్పడే ఆ డబ్బు ఎప్పడు పోవాలో కూడా నిర్ణయింప బడుతుంది. కాని శంకరుడు అనుగ్రహించిన గృహం 20 తరాల నుండి అలాగే సంపదతో ఉంది, అది ఆయన యోగిక్ పవర్.

ఏదో యాదృచ్ఛికంగా జరిగిపోయింది, యేక్సిడెంటల్‌గా జరిగిపోయింది అంటారు. యాదృచ్ఛికంగా జరిగిపోవటానికి మీరు తెగిపోయిన గాలిపటంలాగ లేరు. అంతా దైవప్రణాళిక తోటి జరుగుతూ ఉంటే యాదృచ్ఛికం ఏముంది అన్నారు భగవాన్. ప్రతీ చిన్న విషయం కూడా ఈశ్వరసంకల్పం ప్రకారం జరుగుతోంది. ఈశ్వరునికి తెలియకుండా ఈ సృష్టిలో ఏదీ జరగటానికి వీలులేదు. అలా జరిగిపోయింది, ఇలా జరిగిపోయింది, ఏదో జరిగిపోయింది అంటే యాదృచ్ఛికం అంటూ ఏమీ లేదు. నీ శరీరం పుట్టినది మొదలు వల్లకాటికి వెళ్ళేవరకూ ప్రతీవాడి జీవితం ఈశ్వరుని ప్రణాళిక ప్రకారమే జరుగుతుంది. నాకు ఎర్రబట్టలు అంటే సరదా, ఇప్పడు క్రమంప్రకారం నాకు సన్యాసం పుచ్చుకోవటం కుదరదు, మీరు సన్యాసం పుచ్చుకున్నారు, మీరు అదృష్టవంతులు అని రామకృష్ణమఠ్‌స్వామితో అన్నాను. నాన్నగారు మీరు మమ్మల్ని మాయచేయకండి, బట్టలలో సన్యాసం లేదు, హృదయంలో సన్యాసం ఉంది. ఏదో ఎర్రబట్టలు కట్టుకొన్నాము అని మేము సన్యాసులం కాదు, ఏదో సాంప్రదాయం కోసం అలా పెట్టారు. సన్యాసం బట్టలలో లేదు. వాడు గృహస్థుడైనా వాడి హృదయం ఖాళీగా ఉంటే వాడు సన్యాసి అని చెప్పారు.

పూర్ణానది ఆచార్యుల వారి ఇంటికి దూరంగా ఉండేది. ఆచార్యుల వారి తల్లి నదీస్నానానికి వెళ్ళి ముసలితనం వలన మధ్యలో పడిపోయేది. తల్లి స్నానానికి అనుకూలంగా ఉంటుందని ఆనదిని ప్రార్థించి వారి ఇంటి ప్రక్కనుండి వెళ్ళేలాగ చేసాడు. ఆచార్యుల వారికి

ఇల్లు విడిచిపెట్టి వెళ్ళే సమయం వచ్చేసింది. సన్యాసం పుచ్చుకోవ డానికి తల్లి అనుమతి అడిగితే ఆవిడ ఒప్పకోలేదు. తల్లి అనుమతి లేకుండా వెళ్ళటం శ్రేయస్సు కాదు. అందుచేత ఆయన స్నానం చేసేటప్పడు ఒక మొసలిని కల్పించి, ఆ మొసలి ఆయనను నదిలోనికి లాక్కుపోతున్నట్టు చూపించాడు. తల్లి కేకలు పెడుతుంది. నాకు సన్యాసం ఇస్తే ఈ మొసలి నన్ను వదిలివేస్తుంది, లేకపోతే చనిపోతాను అని చెప్పాడు. చనిపోయే కొడుకు కంటే, సన్యాసం పుచ్చుకొన్న కొడుకు ఎక్కడో ఒకచోట ఉంటాడు కదా అని సన్యాసం పుచ్చు కోవటానికి అప్పడు తల్లి ఒప్పకొంది. అప్పడు దొంగమొసలి ఆయన కాలు విడిచిపెట్టి వెళ్ళిపోయింది, ఆచార్యులవారు పైకి వచ్చారు. నేను సన్యాసిని అయిపోయాను కదా. ఇంక యింటికి రాకూడదు అని తల్లితో చెప్పారు. నువ్వు ఒక్కడివే కుమారుడవు, నాకు దూరంగా వెళ్లిపోతున్నావు, నా చివరి టైములో నువ్వు వచ్చి నీ చేత్తోటి నన్ను పంపు అని తల్లి అడిగింది, అలానే చేస్తాను అని తల్లికి మాట ఇచ్చారు. అలాగే తల్లికి చివరిదశలో ఆయన కాలడి వచ్చి, తల్లికి బ్రహ్మం గురించి చెపుతారు. అబ్బాయి నువ్వు ఏదో చెపుతున్నావు, నాకు అగమ్య గోచరంగా ఉంది నాకు ఏమీ తెలియటంలేదు అని తల్లి చెపుతుంది. ఆవిడ ఎక్కువగా విష్ణువును ప్రార్థించేది. అప్పడు ఆచార్యులవారు మహావిష్ణువును ప్రార్థించి విష్ణువును దర్శింపచేస్తారు. విష్ణువు అంటే ఆవిడకు చాలా ప్రీతి కాబట్టి సడన్‌గా మనస్సు ఆ రూపం మీద ఆగిపోయింది. జీవితం పొడుగునా ఏ రూపాన్ని అయితే ఆరాధించిందో మనస్సు ఆ రూపం మీద నిలబడింది, అలా స్మరిస్తూ, స్మరిస్తూ విష్ణువులో ఐక్యమైపోయింది. ఆయన సన్యాసి కాబట్టి తల్లి శవాన్ని దహనం చేయటానికి వీలులేదు అని ఆయన కుటుంబీకులు వ్యతిరేకించారు. తల్లికి మాట ఇచ్చాను అందుచేత నేనే చేస్తాను అని ఆచార్యులవారు చెప్పారు. తల్లి శవాన్ని ఆయనే తీసుకొనిపోయి, కుటుంబీకులు నిప్ప ఇవ్వకపోతే ఆయనే నిప్పను సృష్టించి, ఆయనే దహనం చేసారు.

నర్మదానది ప్రక్కనే గుహలో గోవిందభగవత్పాదుడు ధ్యానం చేసుకొనే వాడు. ఆచార్యులవారు అక్కడకు వెళ్ళారు. ఎవరు మీరు అని గోవింద భగవత్పాదుడు అడిగాడు. ఈ దేహము నాది అని కాని, ఈ ప్రాంతం నాది అని కాని ఏమీ లేదు. అంతటా వ్యాపించి ఉన్న వస్తువే నేను, ఏదైతే చైతన్యమో అదే నేను. అందుచేత అది నేను, యిది నేను అని చెప్పటానికి అవకాశం లేదు అన్నాడు. గోవిందభగవత్పాదుడు ఆచార్యుల వారిని గ్రహించాడు. ఆచార్యులవారు అక్కడ కొంతకాలం ఉన్నారు. అప్పడు నర్మదానదికి వరదలు వచ్చాయి. ఆ వరదలకు గోవిందభగవత్పాదుడు ఉన్న ఊరు మునిగిపోయే పరిస్థితి వచ్చింది. అప్పడు

ఆచార్యులవారు కమండలం అక్కడ పెట్టి నర్మదా నదిలో ఉన్న వరద నీరు అంతా లాగేసారు. అవసరాన్ని బట్టి యిటువంటి మహిమలు చేసారు. గోవిందభగవత్పాదుడు ఆచార్యుల యొక్క ఔన్నత్యాన్ని గుర్తించి నువ్వు యిక్కడ నుండి కాశీ వెళ్ళు అని చెప్పారు. అప్పుడు హిందూమతం శాఖలుగా విడిపోయింది. శివుడు ఒక్కడే దేవుడు అని కొంతమంది, విష్ణువు ఒక్కడే దేవుడు అని కొంతమంది, అమ్మవారే దేవుడు అని కొంతమంది ఇలా అందరూ తలో రకంగా విడిపోయారు, హిందూమతంలో అలా పేచీలు పెట్టుకొంటున్నారు. అప్పుడు ఆచార్యులవారు ఉన్నది ఒక్కటే, అదే బ్రహ్మం, వాడే శివుడు, వాడే విష్ణువు అని బోధించి హిందూమతంలో ఐకమత్యం తీసుకొని వచ్చాడు. ఆత్మ ద్వైతం కాదు, ఆత్మ అద్వైతం, నువ్వు అద్వైతమతాన్ని స్థాపించు, దానిని బోధించు అని గోవిందభగవత్పాదుడు ఆచార్యులవారికి చెప్పారు. ఆచార్యుల వారు కాశీ వచ్చి విశ్వేశ్వరుని దర్శించుకొని ఒక మాట చెప్పారు. భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడు, కాని కాశీలో ఉన్నాడు అనే బుద్ధితో నేను ఇక్కడకు వచ్చాను. అంటే అంతటా ఉన్న నిన్ను ఎక్కడో ఒక గుడిలో లింగానికి పరిమితం చేస్తున్నాను. ఈ తప్పకు నన్ను క్షమించి ఆశీర్వదించు అని కాశీవిశ్వేశ్వరుడిని ప్రార్థించాడు.

ఆచార్యులవారు బ్రాహ్మణ అగ్రహారంలో పుట్టారు, కొంచెం ఆచారాలు ఉన్నాయి. ఈయన ఆచార్యుడు అయిపోతున్నాడు, పెద్దవాడు అయిపోతున్నాడు యింక ఈ ఆచారాల గొడవ, కులాల గొడవ ఉండకూడదు అని విశ్వేశ్వరుడు ఏమి చేసాడంటే ఆయన మణికర్ణికా ఘాట్‌లో స్నానం చేసి వస్తూ ఉంటే ఈశ్వరుడు ఛండాలుడి రూపంలో ఎదురుగా వస్తాడు. ఛండాలుడి రూపంలో ఉన్న ఈశ్వరుడిని దూరంగా పో అంటారు ఆచార్యులవారు. దూరంగా పో అంటే ఎవడు పోవాలి? ఈ రెండు శరీరాలు పంచభూతాలతోటి చేసారు. లోపలఉన్న వస్తువును చూస్తే నీలో ఏముందో నాలోనూ అదే ఉంది. దూరంగా పొమ్మంటున్నావు కదా. శరీరమా పోయేది, లోపల ఉన్న పరమాత్మా పోయేది, ఇప్పడు ఎవరు పోవాలి అని అడిగాడు. ఇందులో చాలా ఫిలాసఫీ ఉంది, వచ్చినవాడు సామాన్యుడు కాదు, ఈశ్వరుడే అని ఆచార్యులవారు గ్రహించి ఒక పంచకం చెప్పాడు. ఆచార్యులవారు సాహిత్యాన్ని అంతా మూడు రూపాలలో తీసుకొనివచ్చారు. ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలకు భాష్యాలు వ్రాసారు. ఈ మూడు గ్రంధాలు శంకరుడు రాకముందే ఉన్నాయి కాని వాటికి ప్రచారం లేదు. ఆచార్యుల వారు వాటికి భాష్యాలు వ్రాసి, వాటిని ప్రచారం చేసారు. ఈ భాష్యగ్రంధాలు అర్థమవ్వటం కష్టం అని, ఆయన సొంతమాటలతో తేలికగా అర్థమవ్వటం కోసం ప్రకరణగ్రంధాలు వ్రాసారు. అంటే ఆ గ్రంధాల సారాన్ని సొంత మాటల ద్వారా ప్రకటించాడు కాబట్టి వాటిని ప్రకరణ

గ్రంథాలు అంటారు. తర్వాత అందరి దేవతల మీద వారిని ఎలా పూజించాలి, ఎలా ఆరాధించుకోవాలి అనే పద్ధతులు అన్నీ తెలియపరిచాడు, వాటిని స్తోత్రగంధాలు అంటారు. ఆచార్యులవారు కాశీలో కొంతకాలం ఉన్నారు, ఆయన చాలా మేధావి. అక్కడ ఉన్న పండితులను అద్వైతసిద్ధాంతానికి కన్విన్స్ చేయగలిగాడు.

బ్రహ్మ సత్యం, జగత్తు మిధ్య అన్నారు ఆచార్యులవారు. జగత్తు నామరూపాలుగా సత్యం కాదు, బ్రహ్మంగా సత్యమే అన్నారు. అంటే మన కళ్ళకు కనబడే ప్రపంచం కూడా బ్రహ్మమే. బ్రహ్మం తప్పించి ఏమీ లేదు. మీ బుద్ధి నామరూపాలకు పరిమితం అవ్వటం వలన అది జగత్తుగా కనిపిస్తోంది. ద్వైతులు ఏమంటారు అంటే జీవుడూ నిజమే, దేవుడూ నిజమే, జగత్తూ నిజమే అంటారు. నిజమనేది ఒకటిగా ఉంటుంది కాని రెండుగా ఉండదు, మూడుగా ఉండదు అని అద్వైతులు చెపుతారు. తాడు పాముగా కనిపించినట్లే బ్రహ్మమే జగత్తుగా కనిపిస్తోంది అని ఆచార్యులవారు చెప్పారు. అయితే ద్వైతులు ఏమంటారు అంటే తాడు పాముగా కనిపిస్తోంది అంటే ఆ చూచేవాడు ఇంతకుముందు పాముని చూసి ఉండాలి కదా. అసలు పాము అంటూ ఒకటి ఉంటే ముందుగా పాముని చూసి ఉంటే తాడును చూసి పాము అనుకొంటున్నాడు కాని అసలు పాము ఎలా ఉంటుందో తెలియని వాడు తాడును చూసి పాము అని ఎలా అనుకొంటాడు. పాము ఎలా ఉంటుందో తెలియని వాడికి తాడు పాములాగ ఎలా కనిపిస్తుంది. అదీ పేచీ. సద్వస్తువును నిర్వచనం చేయటంలో యివన్నీ అభిప్రాయభేదాలు, ఈ గొడవలు మనకి వద్దు.

రమణమహర్షిగారు ఏమన్నారంటే అది ఒకటా, రెండా, మూడా అనే పేచీలు మనకు అనవసరం. ఉన్నది ఉన్నట్లుగా నీకు వ్యక్తమైన తరువాత అది నీకే తెలుస్తుంది కదా. యిప్పుడు మైసూర్‌పాక్ నీ చేతిలో ఉంది యిది తియ్యగా ఉందా, పుల్లగా ఉందా, చేదుగా ఉందా అని యిలా పేచీలు పెట్టుకునే బదులు నోట్లో వేసుకొంటే అది ఎలా ఉందో నీకే తెలుస్తుంది కదా. ఈ గొడవలలోనికి వెళితే అందులో నుండి నువ్వు బయటకు రాలేవు. నీ హృదయంలో ఉన్న పరమేశ్వరుడు నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు వాడు ఎలా ఉన్నాడో నీకే తెలుస్తుంది కదా, అంటే తినబోయేముందు రుచి ఎందుకు అన్నారు భగవాన్. ఈ వాదనల లోనికి భగవాన్ వెళ్ళలేదు. ఆచార్యులవారు శృంగేరీలో ఒకటి, బదరీలో ఒకటి, పూరీజగన్నాథంలో ఒకటి, ద్వారకలో ఒకటి ఇలా నాలుగు మఠాలు స్థాపించి, నలుగురు శిష్యుల్ని అక్కడ టీచర్స్ కింద ఉంచి, మీరు ధర్మం గురించి బోధించండి, టీచింగ్ విడిచిపెట్టవద్దు అని చెప్పి వెళ్ళారు. సన్యాసధర్మం అంటే వారు సబ్జక్టు బాగా స్టడీ చెయ్యాలి, దానిని ఆచరించాలి, ఇతరులకు అర్థమయ్యేలాగ బోధించాలి.

ఇప్పుడు పెద్దపెద్ద మఠాలలో కూడా టీచింగ్ తగ్గిపోయింది. హిందూమతంలో టీచింగ్‌కు విలువ తగ్గిపోయింది, క్రైస్తవమతంలో టీచింగ్‌కు చాలా విలువ ఇస్తారు.

దక్షిణామూర్తి మౌనంగా బోధించాడు. అయితే అప్పుడు ఆయన దగ్గర కూర్చున్న వాళ్ళు మహామేధావులు కాబట్టి ఆయన మౌనాన్ని అర్థం చేసుకున్నారు. మనం మొద్దులకింద ఉన్నాము, మనకు చెప్పినా అర్థంకావటంలేదు. ఆ దక్షిణామూర్తి ఇప్పుడు శంకరుడు రూపంలో వచ్చాడు. ఇప్పుడు వీళ్ళు సామాన్యమానవులు, వీరికి మౌనం సరిపోదు అని పుస్తకాలు వ్రాసి, వాటిని అర్థం అయ్యేలాగ బోధిస్తూ భారతదేశం అంతా మూడుసార్లు తిరిగాడు, ఎంత కరుణామయుడు కాకపోతే అలా తిరుగుతాడు. విష్ణువుమీద, శివుడుమీద, దేవిమీద, గణపతి మీద స్తోత్రాలు వ్రాసి ఎవరికి ఇష్టమైన దేవతను వారు ఆరాధించుకోవచ్చు, ఈ దేవతలందరికీ ఆధారంగా ఉన్నది బ్రహ్మమే, అందరిదేవతలలో ఉన్న సద్వస్తువు ఒక్కటే అని చెప్పాడు. ఆచార్యుల వారి విషయంలో అంతా టీచింగే, టీచింగ్‌తోనే మనలోని చీకటిని పోగొట్టేవాడు. రమణస్వామి ఏమిచేసారు అంటే దక్షిణామూర్తిలాగ పూర్తిగా మౌనంగా లేడు, శంకరుడిలాగా ఉదయం మొదలు సాయంత్రందాకా టీచింగ్‌లేదు. ఆయన దగ్గరకు వచ్చినవారికి అర్థమౌతుంది అంటే మౌనంగా బోధించారు, మాటలు చెప్పితే కాని అర్థంకాదు అనుకొంటే అప్పుడు మాటలు చెప్పేవారు. తత్వం మటుకు ఇద్దరిదీ అద్వైతమే.

నువ్వు సత్కర్మ నిష్కామంగా చెయ్యి. అంతమాత్రంచేతనే నీకు ఆత్మజ్ఞానం కలుగదు, దానివలన చిత్తశుద్ధి కలుగుతుంది. శంకరుడు చెప్పింది ఏమిటి అంటే నీకు కుండ ఉంది, బియ్యం ఉన్నాయి, కట్టెలు ఉన్నాయి, నీళ్ళు ఉన్నాయి. ఇవి అన్నీ ఉన్నా నిప్పులేకుండా నువ్వు వంట చెయ్యగలవా? అలాగే నీకు ఎన్ని ఉన్నా ఫైనల్‌గా ఆత్మజ్ఞానం పొందాలి. కేవలం ఏదో కర్మ చేయటం వలన ఆత్మజ్ఞానం రాదు. ఎక్కడైతే నీ యింద్రియాలు, మనస్సు నిశ్శేషంగా అణిగిపోయాయో అక్కడ మాత్రమే సద్వస్తువు నీకు తెలియబడుతుంది కాని బయట ఏదో చేయటం వలన ఆత్మజ్ఞానం రాదు. ఒకటి గుర్తుపెట్టుకోండి. మీరు మంచిపనులు చెయ్యండి, పూజలు చెయ్యండి, జపాలు చెయ్యండి, యివన్నీ మంచివే కాని ఇవి గురువుఅనుగ్రహానికి సరిపోవు. కర్మమార్గం ద్వారా నీకు అర్హత కలుగుతుంది. అన్నం ఉడకడానికి అగ్ని ఎలా అవసరమో అలాగే నీకు ఎంత అర్హత, యోగ్యత ఉన్నప్పటికీ ఫైనల్‌గా గురువు అనుగ్రహం వలన మాత్రమే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. గదిలో చీకటి ఉంది అనుకోండి, చప్పట్లు కొట్టటం వలన, భజనలు చేయటం వలన చీకటి పోతుందా? చీకటి పోదు. దీపం వెలిగిస్తే చీకటి పోతుంది. అలాగే నీకు జ్ఞానం కలిగితేగాని నీ హృదయంలో ఉన్న సద్వస్తువు నీకు

వ్యక్తం కాదు.

పండితులు అందరూ ఆత్మను శాస్త్రాలలో వెదకటం ప్రారంభించారు. తత్వానికి విలువ తగ్గిపోయింది, సాహిత్యానికి విలువ పెరిగిపోయింది. బ్రహ్మజ్ఞానం మనకు గమ్యం కాని సాహిత్యం మనకు గమ్యం కాదు. రమణమహర్షిగారు లోకానికి చేసిన మేలు ఏమిటి అంటే మీరు బ్రహ్మం గురించి శాస్త్రాలలో వెదుకుచున్నారు, పాండిత్యాన్ని ఆత్మజ్ఞానం అనుకొంటున్నారు. డబ్బు ఎటువంటిదో పాండిత్యం అటువంటిదే. బ్రహ్మం గురించి శాస్త్రాలలో వెతుకుచున్న మానవజాతికి అది బయటలేదు, వస్తువు మీ హృదయంలోనే ఉంది, అందుచేత మనం హృదయంలో అన్వేషించాలి. వస్తువు ఎక్కడ ఉందో అక్కడ వెదికితే అది దొరుకుతుంది అని తెలియజెప్పినవారు భగవాన్. ఆత్మ జ్ఞానానికి, పాండిత్యానికి ఉన్న తేడాని భగవాన్ లోకానికి తెలియపర్చారు, రాంగ్ డైరెక్షన్‌లో వెళుతున్న మానవజాతికి రైట్ డైరెక్షన్ చూపించారు.

సత్కర్మ నిష్కామంగా చేస్తే చిత్తశుద్ధి కలుగుతుంది, మనస్సు అంతర్ముఖమవుతుంది. ఇక్కడ భగవాన్ గొప్ప విషయం చెప్పారు. బాహ్యముఖమయిన మనస్సుకు ప్రారబ్ధంకాని అంతర్ముఖమైన మనస్సుకు ప్రారబ్ధం ఏమిటి? రామకృష్ణపరమహంసగారు కేన్సర్‌తో బాధపడుతున్నారు, ప్రారబ్ధం అనుభవిస్తున్నారు అని మీకు అనిపిస్తుంది కాని అంతర్ముఖమైన మనస్సుకు ప్రారబ్ధం లేదు. కేన్సర్ వచ్చింది కదా అనుభవిస్తున్నాడు కదా అంటే చూచేవాడికి అనిపిస్తుంది కాని వాడికి ఏమీలేదు. తనువు తాను కాదు అని తెలిసినవాడికి ప్రారబ్ధం ఏమిటి? దేహబుద్ధి ఉన్నవాడికి ప్రారబ్ధంకాని ఆత్మబుద్ధి ఉన్నవాడికి ప్రారబ్ధం ఏమిటి? ప్రారబ్ధం అనుభవించవలసిందే అని పండితులు కూడా చెపుతారు. చూసేవాడికి వాడు ప్రారబ్ధం అనుభవిస్తున్నాడు అనిపిస్తుంది కాని వాడికి ఏమీ ఉండదు. మనస్సు బహిర్ముఖమైనవాడికి ప్రారబ్ధం యొక్క ప్రభావం ఉంటుంది కాని అంతర్ముఖమైన వాడికి ప్రారబ్ధం యొక్క ప్రభావం ఉండదు, పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా అవి వాడిని ముట్టుకోవు, ప్రాపంచికవిషయాలు ఏవీ వాడిని ఉద్రేకపరచలేవు.

ముందు దేహబుద్ధిని పోగొట్టుకో, దొంగనేను నుండి విడుదలపొందు. అప్పుడు నువ్వు వంద సంవత్సరాలు జీవిస్తే, ఒకవేళ బాహ్యపరిస్థితులు నీకు బాగాలేకపోయినా ఒక్క క్షణం కింద వెళ్ళిపోతుంది. గడ్డం గీసుకొనేవారు అద్దం ఎదురుగా పెట్టుకొంటారు. అద్దంలో ప్రతిబింబాన్ని చూస్తూ వీడి బింబానికి గడ్డం గీసుకుంటాడు. నీ గడ్డం వదిలేసి నువ్వు

ప్రతిబింబానికి గడ్డం గీయటానికి ప్రయత్నం చేయటం ఎటువంటిదో శాస్త్రాలలో ఆత్మని వెదకటం అటువంటిది అన్నారు భగవాన్. నీ గెడ్డం ఎలా ఉందో, ఎక్కడ గీసుకోవాలో ప్రతిబింబం చెపుతుంది, దానిని బట్టి గెడ్డం గీసుకుంటున్నావు. అలాగే వస్తువు నీ హృదయంలో ఉంది అని శాస్త్రం చెపుతోంది అందుచేత నువ్వు హృదయంలో అన్వేషిస్తే వస్తువు దొరుకుతుంది. రమణస్వామి చెప్పింది హృదయవిద్య, ఆత్మవిద్య. అటునుంచి ఇటు చెప్పినా, ఇటు నుంచి అటు చెప్పినా నిన్ను హృదయంలోనికి ఎలా తీసుకొని వెళ్ళాలో అదే ప్రయత్నం చేసాడు. ఉన్నదంతా హృదయంలోనే ఉంది, బయట ఏమీలేదు, అందుచేత నీ మనస్సును అంతర్ముఖం చెయ్యి.


మనం ఇంగ్లీషు మందులు వాడినా, ఆయుర్వేదం వాడినా నువ్వు రోగంలో నుండి బయటకు రావాలి అలాగే నువ్వు కర్మయోగం, భక్తియోగం ఏ యోగాన్ని ఆశ్రయించినా దేహబుద్ధిలో నుండి విడుదలపొందాలి, ఆత్మబుద్ధిని పొందాలి. మీకు కష్టాలు వస్తూ ఉంటాయి, దుఃఖం వస్తూ ఉంటుంది. మధ్యమధ్యన కొంత విశ్రాంతి ఉంటుంది, అదే మీరు ఆనందం అనుకొంటున్నారు, అది ఎంతసేపు ఉంటుంది. ఇప్పడు మా రోజులు బాగా ఉన్నాయి అంటే ఎన్ని కష్టాలు వచ్చి మీ నెత్తిమీద పడటానికి సిద్ధంగా ఉన్నాయో మీకు తెలియటం లేదు. మామిడిపండు మీరు తినకపోవచ్చుకాని తిన్నవాళ్ళకు రుచి తెలుస్తుంది కదా. మన హృదయంలో ఒక సత్యం ఉంది. దాని తాలుక ఎరుక మనకులేదు. దాని తాలుక ఎరుక మనకు వస్తే దాని రుచి మనకు తెలుస్తుంది, వాడు మాత్రమే నిన్ను అనుగ్రహించగలడు. అసలు నాకే రుచి తెలియనప్పడు మీకు రుచి ఏమి చూపిస్తాను. మేమే అడవి మనుషులం అయినప్పడు ఇంక సద్వస్తువు గురించి మీకు ఏమి చెపుతాము. శంకరుడు అది రుచి చూసాడు కాబట్టి, ఆ రుచి వాడికి అనుభవంతో ఉంది కాబట్టి, దాని గురించి మనకు మాటలతో చెప్పగలిగాడు. ఆచార్యులవారికి శాస్త్రజ్ఞానం, ఆత్మజ్ఞానం రెండూ చేతిలో ఉన్నాయి. అందుచేత గంటలతరబడి వాదించగలడు, ఓడిపోవటం అంటూ ఉండదు. కైలాసంలో ఉన్న పరమేశ్వరుడే శంకరుడి రూపంలో వచ్చి మనకు బోధించాడు. ఆయన చెప్పింది చదివి, అర్థం చేసుకొని, ఒకవేళ అర్థంకాకపోతే గురువు దగ్గర చెప్పించుకొని దానిని ఎంజాయ్ చెయ్యవలసిందే కాని ఆ వాక్యంలో తప్ప ఉంది అని అనటానికి అవకాశం లేదు. ఎందుచేతనంటే అక్కడ సత్యమే మాట్లాడింది. మనం ఈరోజు శంకరజయంతి జరుపుకుంటే సరిపోదు మీరందరూ ఆయన అనుగ్రహం పొందాలి. ఆచార్యులవారి అనుగ్రహం, దయ మీ అందరి శిరస్సులమీద ఉండాలని హృదయపూర్వకంగా ఆయననే ప్రార్థిస్తున్నాను.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| జూన్ | 13 | గుండుగొలను |
| జూన్ | 21 | శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు |
| జూలై | 3 | గురుపౌర్ణమి, సత్యసాయి నిగమ్, హైదరాబాద్ |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**





# గురుపౌర్ణమి మహోత్సవం

**అందరికీ ఇదే మా ఆహ్వానం**

**శ్రీ సత్యసాయి నిగమాగమము, శ్రీ నగర్ కాలనీ, హైదరాబాద్**

**నందు ది॥ 03-07-2012 మంగళవారం**

**ఉదయం గం॥ 7-00లకు**

## సద్గురు శ్రీ నాన్నగారు దర్శనము

**మరియు మధ్యాహ్నం గం॥ 2-00లకు ప్రవచనం**

**- శ్రీ నాన్నగారు సత్సంగ్, హైదరాబాద్**

# మనః ప్రవృత్తే - మాయ

మనస్సు అంటే కలలు కనటం, కోరికలు కోరటం అని అర్థం. మనం ఎప్పడు లోపలికి చూచుకోలేము. మన చూపు ఎప్పడూ బయట ప్రకృతివైపుకే పరుగులు తీస్తూ ఉంటుంది. దీనినే 'మనఃప్రవృత్తి' అంటారు. కంటికి కనిపిస్తున్నవన్నీ కలలే. కనిపించే వస్తువులు అసత్యమైతే కలలు కనే మనస్సు ఎలా సత్యమౌతుంది? మనం కలల ప్రపంచంలో జీవిస్తున్నాము. మేలుకొని ఉన్నామని అనుకొంటున్నాము. సంభవిస్తున్నవన్నీ కలలే అసత్యాలే వాటికి విలువలేదు అని మనం భావిస్తూ శాంతంగా జీవించాలి. మనస్సు ఎప్పడూ లేని గౌరవాలను ఆపాదించుకొంటూ వెర్రిగా ప్రవర్తిస్తుంది. అమనస్కస్థితిలోనే ప్రాజ్ఞ బయటపడుతుంది. వివేకం ఉదయిస్తుంది. పిచ్చ తెలివి తెల్లారిపోతుంది. మనస్సు అనుభవాలమీద పద్ధతులమీద ఆధారపడి ఉంటుంది. దానికి ఏ ఆసరా లేకపోతే కుప్పకూలుతుంది. మూఢస్వభావం అంటే, ద్వేషం. విషయానురక్తి. మనస్సును గమనిస్తే ఇది ఇలా ప్రవర్తిస్తుంది. నాకు ఇది అంటే ఇష్టం - అది అంటే నాకు అయిష్టం. మిగతా వాటిని పట్టించుకోను అంటూ వాసనానుగుణంగా యాంత్రికంగా అలా తిరుగుతూనే ఉంటుంది. ప్రకృతి విషయాలపై ఆలోచనలు తగ్గించు కోవాలి. ఆత్మానుభవానికి సంబంధించిన భక్తిరకమైన అనుభూతులను పెంచుకోవాలి. ప్రకృతి విషయాలపై ఆలోచించటమంటే మనలను మనం వంచించుకొనే కార్యక్రమం. మనం స్మరిస్తున్నవన్ని గాలిమేడలు. పేకమేడలు గాలి వీస్తే కూలిపోతాయి. అహంకారానికి అలాంటివి ఆలోచించటం అంటే ఇష్టం. కల్పనలే అహంకారానికి ఆహారంగా ఉంటాయి. దానికి వాస్తవం అంటే ఎప్పడూ జీర్ణం కాదు. 'ఉనికి' అని అంటే నిర్మలంగా ఉన్నదని చెప్పగల సద్వస్తువు. అది కేవలంగా ఉంది. అలా మనం ఉండటానికి గురు అనుగ్రహాన్ని ప్రార్థనాపూర్వకంగా అనుసరించాలి. వేచి ఉండాలి. అదే సత్యజీవనానికి నాంది. కాని మన ఆలోచనలు స్వార్థపూరితమై ఇంకొకరి తప్పలను వేలెత్తి చూపేవిగా ఉండకూడదు. ప్రకృతి మనుషుల పోచిపోలు కబుర్లు ఒకరినుండి మరియొకరికి ప్రాకగానే మరింత పెరిగిపోతాయి. పొద్దుట గోరంత ఉంటే సాయంకాలానికి కొండంత పెరిగిపోతాయి. శ్రీనాన్నగారు "సాధకులు ఇటువంటి ప్రకృతి విషయాలు వినవలసిన పరిస్థితి తారసపడితే తప్పించుకొని వెళ్ళిపోవాలి వాటికి బహుదూరంగా ఉండకపోతే అధోగతే" అంటారు. ఎరుక ముందు సంపాదించుకోవాలి. అవి లేకపోవటం వల్లనే పైవి ఉండగల్గుతాయి. అహంకారం ఎప్పడు ఫలితాలను ఆశిస్తూ ప్రవర్తిస్తుంది. వాటికోసం ఉవ్వెళ్ళు ఊరుతూ ఉంటుంది నాకు ఎప్పడు ఏది లభిస్తుంది అని. ఏ పనీ చెయ్యకుండా లాభాలను సంపాదించుకొనే వీలుకోసం అడ్డదార్లు అన్నీ వెతుక్కుంటుంది. మన అంతరాంతరాళ్ళ లోంచి నాకు ఏమీ వద్దు నీ పాదాల మీద భక్తిచాలు అని ఒక్కసారి మనఃపూర్తిగా అనుకోగలిగిన క్షణంలోనే 'నిశ్శబ్దం' మనలను ఆవరిస్తుంది. ఒక భగవద్ ఆశీర్వాదం మన మీద వర్షిస్తుంది. మనం మన ఈ సంకల్పాన్ని ఇప్పడే ఈ క్షణంలోనే వదిలేస్తే ఎంత శాంతి, సుఖము వస్తుందో మనకీ తెలుస్తుంది. మనోనేత్రాన్ని మూయటమే మౌనం దాన్ని గురు అనుగ్రహంతో సాధించాలి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**